చవితికి గణనాథులు సన్నద్ధం

- రెండు నెలల ముందుగానే ఆర్డర్లు
- ఖర్చుకు వెనుకాడని ఉత్సవ కమిటీలు
- 120 గ్రామాల్లో చవితి వేడుకలకు సన్నద్ధం



సోమేశ్వరంలో ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న భక్తులు



సిద్ధమవుతున్న వినాయక ప్రతిమలు

రాయవరం: వినాయక చవితి..భారత దేశంలో హిందువులు జరుపుకునే అతి ముఖ్యమైన పండుగల్లో ఇది కూడా ఒకటి. శివపార్వతుల కుమారుడైన వినాయకుడి పుట్టిన రోజునే వినాయక చవితిగా జరుపుకుంటారు. వినాయక చతుర్థి, గణేశ చతుర్థి అని కూడా పిలుస్తారు. ఉత్సవాల్లో భాగంగా 11 రోజుల పాటు గణేశ విగ్రహాలు ప్రత్యేక పూజలు అందుకుని.. ఆ తర్వాత నిమజ్జనం కోసం ఊరేగింపుగా బయలుదేరుతాయి. వినాయక చవితి పండుగంటే యువతకి ఎక్కడిలేని ఉత్సాహం వస్తుంది. మరో పది రోజుల సమయం ఉండడంతో విగ్రహాల కోసం ఇప్పటికే భారీగా ఆర్డర్లు ఇస్తున్నారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలందరిలో జాతీయ స్ఫూర్తిని రగిలించడంలో వినాయక చవితి మహోత్సవాలు కూడా కీలక పాత్ర పోషించారు. 1892లో దేశ ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని రగిలించేందుకు స్వాతంత్ర సమరయోధుడు లోకమాన్య తిలక్..గణపతి ఉత్సవాలను ప్రారంభించారు.

ఉపాధి కోసం రాష్ట్రాలు దాటి

జిల్లాలోని పలు పట్టణాల్లో రాజస్థానీలు, స్థానిక తయారీదారులు గణనాథుల తయారీలో నిమగ్నమయ్యారు. వారంతా ఉపాధి కోసం రాజస్థాన్ నుంచి జిల్లాకు వచ్చారు. సాధారణంగా ఉపాధి దొరకని వారు తమకు ఉపాధి మార్గం చూపమని దేవుడిని వేడుకోంటారు. అయితే వీరు మాత్రం దేవుడి విగ్రహాలను తయారు చేయడమే ఉపాధికి మార్గంగా ఎంచుకున్నారు. వేల కిలోమీటర్ల నుంచి పొట్ట చేతపట్టుకుని తమ చేతిలో ఉన్న విద్యను దేవుడి రూపంలో ఉపాధి పొందుతున్నారు. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాలకు చెందిన వారు క్లస్టర్ పరిధిలోని మండపేట, ద్రాక్షారామ, రామచంద్రపురంలో విగ్రహాల తయారీని చేపట్టారు. వినాయకచవితి, దుర్గాష్టమిల్లో విగ్రహాలకు ప్రాధాన్యం పెరగడంతో విగ్రహాల తయారీ నిమిత్తం రాజస్థాన్ నుంచి వచ్చిన కుటుంబాలు ఏడాది పొడవునా ఇక్కడే నివాసాలు ఏర్పరుచుకుని ఉంటున్నారు.

బహు రూపాల్లో:

దేవుడు జీవరాశులకు ప్రాణం పోస్తుంటే..అదే దేవుడి రూపాలకు వీరు ప్రాణం పోస్తున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల ముస్తాబవుతున్నాయి. క్లస్టర్ పరిధిలోని 120 గ్రామాల్లో గణేష్ ఉత్సవాలను ఏటా నిర్వహిస్తున్నారు. పట్టణంలో తయారు చేస్తున్న వినాయక విగ్రహాలు రూ.100 నుంచి మొదలుకొని రూ. 25వేల వరకు అందుబాటులో ఉన్నాయి. గణనాథులను గోపీకృష్ణ పార్వతీ పరమేశ్వరుల చెంత, ఎలుక వాహనంపై, నెమలి, సింహం, ఏనుగు, గోవు, సర్పము, నాట్యాకృతి, త్రిశూలంలో ఇలా వివిధ రూపాల్లో చూడచక్కటి రూపాల్లో..రంగుల్లో తీర్చిదిద్ది అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారు.

ఉత్సవ కమిటీల సందడి

గణేశుడి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఉత్సవ కమిటీలు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఉత్సవ కమిటీలు గణనాథుని విగ్రహాలకు ఆర్డర్లు ఇచ్చేందుకు, ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చందాలు వసూలు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాల్లో వీధి వీధినా ఉత్సవ కమిటీలు విగ్రహాలను ఏర్పాటు చేసే పనిలో ఉన్నాయి.

పెరుగుతున్న సంస్కృతి

ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన విగ్రహాల సంస్కృతి ఇప్పుడు పల్లెలకు విస్తరించింది. దీనితో పరోక్షంగా విగ్రహాల తయారు చేసే వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. ప్రతీ ఏటా విగ్రహాలకు ఆర్డర్లు ఇచ్చే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. గ్రామాల్లో వీధి వీధికో ఉత్సవ కమిటీ ఏర్పడుతుంది. గ్రామాలు, నగరాల్లోని బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లలో అందరూ కలిసి వినాయక చవితి వేడుకలను విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని ఎంతో కోలాహలంగా నిర్వహిస్తున్నారు.

సంస్కృతిని అందించాలి



వినాయక ఉత్సవాలు మన సంస్కృతిలో ఒక భాగంగా ఉన్నాయి. భావి తరాలకు వాటిని అందించేందుకు ఈ ఉత్సవాలను ఏటా నిర్వహిస్తున్నాం.

– పిల్లి సత్యనారాయణ, కొత్తకొంపలు, కె.గంగవరం మండలం.

నిబంధనల మేర ఏర్పాటు



ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా చవితి వేడుకలను నిర్వహిస్తున్నాం. పోలీసులు విధించే నిబంధనలకు అనుగుణంగానే విగ్రహాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

– కాలా శివశంకర్, ఉత్సవ కమిటీ సభ్యుడు, రాయవరం.

క్లుప్తంగా

మొండిచేయి చూపిస్తున్న కూటమి ప్రభుత్వం

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు మొండిచేయి చూపిందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మండిపడ్డారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి సుభాష్ కౌలు రైతులకు మంత్రి ఏం న్యాయం చేశారో చెప్పాలని నిలదీశారు. అన్నదాత సుఖీభవ ఇచ్చిన కౌలు రైతుల వివరాల జాబితాలు ఆయా గ్రామాల సచివాలయాల్లో ప్రదర్శనకు పెడితే వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు. ఎంత మందికి సుఖీభవ ఇచ్చారో వాస్తవాలు తెలుసుకోకుండా మంత్రి భ్రమలకు లోనై మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. భూమి ఉన్న రైతుల నుంచి సీసీఆర్‌సీ కార్డులు పొందాలని నిబంధన పెట్టి ఈ ప్రభుత్వం కౌలు రైతుల నోట్లో మట్టి కొట్టిందన్నారు. కూటమి వ్యతిరేఖ విధానాలపై కౌలు రైతులు పోరాటం చేయాలని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. వారి పోరాటానికి అఖిల భారత రైతు కూలీ సంఘం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ తదితర ప్రజా సంఘాలు అండగా నిలుస్తాయని తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం: మండలంలోని సత్యవాడలో ఉన్న శివానంద ధ్యానాశ్రమంలో శనివారం కృష్ణాష్టమి సందర్భంగా నూతన సుధామయ శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆశ్రమం వద్ద భగవద్గీత పారాయణం ఆశ్రమ భక్తులతో ఘనంగా నిర్వహించి అనంతరం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు స్థానిక మహిళా భజన సమాజములచే సంకీర్తనలు పాడారు. కార్యక్రమంలో దివ్యానంద సరస్వతి స్వామి, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రాజకుమార్ మాస్టార్, ప్రముఖ గీతా ప్రచారకులు పోలిశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులు

కాజులూరు: సమ సమాజవాది సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలు నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అమలాపురం పార్లమెంట్ శెట్టిబలిజ సంఘం కన్వీనర్ కడలి రాంపండు అన్నారు. శనివారం సర్దార్ గౌతు లచ్చన జయంతి పురస్కరించుకుని గొల్లపాలెంలో పలువురు బీసీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు. రాంపండు మాట్లాడుతూ, 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన లచ్చన్న స్వాతంత్ర్యం కోసం ఉప్పు సత్యగ్రహం వంటి అనేక ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితాన్ని గడిపారన్నారు. గీత కార్మికులు వంటి అనేక కులవృత్తుల వారి ఆర్థిక, సాంఘిక అభ్యుదయానికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మెడిశెట్టి శ్రీరాములు, దొమ్మేటి చంద్రరావు, దేయ్యాల సత్యనారాయణ, కడలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణాల మంజూరుకు కృషి



నల్లూరులో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ వల్లూరి అప్పలరాజు

కపిలేశ్వరపురం: తమ సహకార సంఘం పరిధిలోని రైతులకు రుణాలను మంజూరు చేసేందుకు కృషి చేస్తానని నల్లూరు పీఏసీఎస్ చైర్మన్ వల్లూరి అప్పలరాజు అన్నారు. సహకార సంఘం కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ తమ సంఘం పరిధిలో 683 మంది సభ్యులున్నారని రూ.3.06 కోట్ల లోన్ టర్నోవర్, రూ.5 కోట్ల వ్యాపార టర్నోవర్‌తో ముందుకు సాగుతుందన్నారు. గత 40 రోజుల్లో సుమారు రూ.40 లక్షలు విలువైన రైతు రుణాలు మంజూరు చేశామన్నారు. సమావేశంలో సభ్యులు కుడిపూడి శ్రీనివాస్, బీర సూర్యారావు కార్యదర్శి గుత్తుల సతీష్, సిబ్బంది ఎల్‌వీఎస్ఎన్ చౌదరి, కాదా సురేష్ పాల్గొన్నారు.

మందపల్లి క్షేత్రంలో తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండల పరిధిలోని మందపల్లిలో ఉమా మందేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. శనివారం స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్ బాబు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ,1.57 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.33,695 రాగా మొత్తం రూ.1,91,581 ఆదాయం వచ్చినట్టు తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ధవలేశ్వరానికి చెందిన అనిల్ కుమార్, నౌదూరి నియాన్ కార్తికేయ, దేవపు హర్షిత్ విఘ్నేష్ రూ.20, 232, హైదరాబాద్‌కు చెందిన పేరి కృష్ణ కౌశిక, లావణ్య దంపతులు రూ.10,116లు శనివారం అందజేశారు. దాతలు ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతలను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వాజ్‌పేయి పాలనలో దేశం పురోగతి



దుగ్గుదుర్రులో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

కాజులూరు: దివంగత మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి పాలనలో దేశం ఎంతగానో పురోగతి సాధించిందని బీజేపీ రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దూడల శంకరనారాయణ అన్నారు. మండలంలోని దుగ్గుదుర్రులో నేతలు శనివారం వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకర నారాయణ మాట్లాడుతూ, వాజ్‌పేయి పాలనలో అనేక కీలక సంస్కరణలు ప్రవేశ పెట్టారన్నారు. ఆయన పాలనలో జిల్లాలో స్వర్ణ చతుర్భుజి పేరుతో జాతీయ రహదారి నిర్మాణం, కోటిపల్లి– కాకినాడ రైల్వే లైన్ నిర్మాణం, యానాం– ఎదురులంక వంతెన నిర్మాణం జరిగాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి నివాళులు

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో శనివారం మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని బీజేపీ నేతలు నిర్వహించారు. తొలుత స్థానికంగా ఉన్న వాజ్‌పేయి విగ్రహానికి నాయకులు కర్రి చిట్టిబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వాజపేయి ప్రధానిగా గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారని, గ్రామీణ సడక్ యోజన ద్వారా గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మించిన ఘనంత ఆయనదేనన్నారు. సర్వశిక్షా అభియాన్ ద్వారా పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం , బాలికల కోసం మరుగుదొడ్ల నిర్మాణం జరిగిందన్నారు. ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు, నాయకులు గుర్రాల సత్యనారాయణ, ఏవీ రమణమూర్తి, సలాది శేఖర్, రామచంద్రపురం రూరల్ అధ్యక్షుడు ఆకేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సీతారామచంద్రుల కళ్యాణం



పీఠంలో నిర్వహిస్తున్న శ్రీసీతారామచంద్రమూర్తుల దివ్య కళ్యాణం

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠం 53వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతీ ఏటా ఆగస్టు 16 నుంచి 18వ తేదీ వరకు వార్షికోత్సవాలను నిర్వహిస్తున్న విషయం పాఠకులకు విధితమే. వార్షికోత్సవాల్లో భాగంగా తొలిరోజు పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) కుమార్తె సత్యవెంకట కామేశ్వరి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. పీఠంలో కొలువైన విజయదుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నేత్రపర్వంగా కల్యాణం

పీఠంలో వేద పండితులచే సీతారామచంద్రమూర్తికి సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం శాస్త్రోక్తంగా భక్తుల జయజయధ్వానాల నడుమ చేపట్టారు. తిరుమల ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు సీతారామచంద్రుల కల్యాణ ప్రాముఖ్యతను వివరించారు.

లోక కల్యాణం కోసమే..

పీఠంలో పూజలతు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు లోక కల్యాణం కోసమే నిర్వహిస్తున్నట్లు విజయదుర్గాపీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం తెలిపారు. కల్యాణాం తిలకించడం వలన సకల శుభాలు కలుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని భక్తులకు ఉద్బోధించారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు సత్యవెంకటకామేశ్వరి, భాస్కరనారాయణ దంపతులు, సత్యకనకదుర్గ, బి.రమ, కోట సునీల్‌కుమార్, హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగనే అవసరం



ఇంటింటికీ వంచన గ్రామ సభలో పాల్గొన్న గొల్లపల్లి సూర్యారావు

సఖినేటిపల్లి: అవినీతికి ఆస్కారం లేని సుపరిపాలనకు, సంక్షేమానికి పెద్ద పీట వేసే పాలనకు రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే అవసరం అని రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జ్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శనివారం సఖినేటిపల్లి, మోరిపోడు, మోరి, శృంగవరప్పాడు గ్రామాలలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్రతో కలిసి బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీలో భాగంగా ఇంటింటికీ వంచన పేరుతో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన గ్రామ స్థాయి సమావేశాల్లో గొల్లపల్లి మాట్లాడుతూ, గత ప్రభుత్వం కన్నా తమ ప్రభుత్వం రెట్టింపు మేలు చేకూరుస్తుందంటూ సూపర్ సిక్స్ హామీలు ఊదరగొట్టిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక మాటమార్చడాన్ని ధ్వజమెత్తారు. గతంలో జగన్ చేసిన పాలన, ప్రస్తుత కూటమి చేస్తున్న పాలనను బేరీజు వేసుకోవాలన్నారు. పరిశీలకుడు నాగేంద్ర మాట్లాడుతూ, మళ్లీ జగన్‌ను గెలిపిస్తేనే పేదల సంక్షేమ పథకాలు వెల్లువిరుస్తాయని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చినరాజా, రాష్ట్ర బీసీ నేత శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఈద రవిరెడ్డి, పార్టీ యువజన ప్రతినిధి కటకంశెట్టి ఆదిత్య, విద్యార్థి విభాగం ప్రతినిధి సహదేవ్, సర్పంచ్‌లు రావి నాగ వెంకట లక్ష్మీదేవి, పసలపూడి లక్ష్మీ పద్మ మంగతాయారు, ఎంపీటీసీలు జాన లక్ష్మీ దుర్గ సూర్యావతి, రాపాక దీవెన కుమారి, గ్రామ శాఖల కమిటీ నాయకులు నల్లి ప్రేమానందం, గెడ్డం శుభాకర్, బళ్ల వీర్రాజు, భైరవశెట్టి శివ, గెడ్డం సూర్యారావు, మద్దాల కృష్ణమూర్తి, పార్టీ కేడర్ ముప్పర్తి త్రిమూర్తులు, రుద్రరాజు రంగరాజు పాల్గొన్నారు.

దైవదర్శనాలకు స్త్రీ శక్తి వర్తించదా?



చింతనలంకలో కరపత్రాలు ఆవిష్కరించిన శ్రీనివాసరావు, నాయకులు

అయినవిల్లి: సీఎం చంద్రబాబు మోసలను రాష్ట్ర ప్రజలు త్వరలోనే ఎండగడతారని, మహిళలకు ఉచిత బస్సు ప్రారంభించి రెండు రోజులు కాకుండానే దైవ దర్శనాలకు వెళ్లిన మహిళలకు స్త్రీ శక్తి వర్తించదని, ప్రత్యేక బస్సుల పేరుతో టిక్కెట్లు వసూళ్లు చేయడంపై వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మండిపడ్డారు. శనివారం చింతనలంక, వెలువలపల్లి, ఎస్.మూలపాలెం గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్ అధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు ఉచిత బస్సు పేరుతో బురిడి కొట్టించారన్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం బస్సులు ఎక్కిన మహిళల వద్ద టిక్కెట్లకు సొమ్ములు వసూలు చేయడం పై మండిపడ్డారు. కార్యక్రమంలో విళ్ల శ్రీను, వస్కాకోటేశ్వరావు, షరాబు, జిల్లా ఉపాధ్యక్షుడు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

రాజోలు: శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని రాజోలు సీఐ నరేష్‌కుమార్ సినీ హీరోల అభిమాన సంఘాలు, మెకానిక్ సంఘాల నాయకులతో శనివా రం సమావేశం నిర్వహించారు. రాజోలు నియోజకవర్గంలో కొత్త సినిమాలు రిలీజ్, అభిమాన హీరోల పుట్టినరోజులు, బెనిఫిట్ షోల సమయంలో బైక్ సైలెన్సర్లు తీసేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. శాంతియుతంగా వేడుకలు నిర్వహించుకునేలా సినీ హీరోల అభిమాన సంఘాల ప్రతినిధులు సహకరించాలన్నారు. అలాగే బైక్ మెకానిక్ సంఘాల నాయకులకు సూచనలు చేశారు.పోలీస్ నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కె.గంగవరం: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొని, చేనేత రంగానికి పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని అద్దంపల్లిలో శనివారం చేనేత జౌళి శాఖ అధికారులు, బ్యాంకు అధికారులు, చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు. తొలుత చేనేత కార్మిక నేతలు మాట్లాడుతూ, త్రిఫ్ట్ రుణాలు మంజూరు చేయాలని, ఆప్కో ద్వారా విక్రయాలు మరలా పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు ప్రధానంగా డ్రాయల్ లిమిట్ 75 శాతం నుంచి 90 శాతానికి పెంచాలని, ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నేతన్న నేస్తం కింద రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని అందించాలని కోరారు. సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ బ్యాంక్ సీఈఓ ప్రవీణ్‌కుమార్, చేనేత జౌళి శాఖ జిల్లా అధికారి పెద్దిరాజు, అభివృద్ధి అధికారి కె.గంగరాజు, సహాయ అభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ మాణిక్యాంబ, నోడల్ అధికారులు, సొసైటీ త్రిసభ్య కమిటి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆలమూరు: జిల్లాలో అత్యంత ప్రమాదకరమైన కొత్తూరు– వెదురుమూడి రోడ్డు మళ్లీ ఓ యువకుడి ప్రాణాన్ని బలి తీసుకుంది. వివాహం జరిగి ఏడాది అవ్వకుండానే మృత్యువాత పడ్డాడు. ఎస్సై నరేష్ కథనం ప్రకారం.. అచ్యుతాపురానికి చెందిన వల్లూరి సాయి నిరంజన్ (26)కు గతేడాది ఆగష్టు 23న వివాహమైంది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న అతడు శనివారం ఉదయం తణుకులోని అత్తారింటికి వెళ్లి వస్తుండగా స్థానిక జొన్నాడ.. జోరిచెట్ల సమీపంలో ఉన్న కోళ్ల ఫారం వద్ద వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొంది. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

జూదరుల అరెస్ట్

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆలమూరు పోలీసులు జరిపిన దాడిలో నలుగురు జూదరులను అరెస్ట్ చేశారు. ఎస్సై నరేష్ కథనం ప్రకారం.. తారకరామ కాలనీ శివార్లలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో శుక్రవారం రాత్రి ఎస్సై నరేష్ నేతృత్వంలో పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.2,700 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణాలు



అంగర రామకృష్ణ పాఠశాలలో పలు వేషధారణల్లో చిన్నారులు

కపిలేశ్వరపురం (మండపేట): హిందూ ఇతిహాసాలలో శ్రీ మహావిష్ణువు ఎనిమిదవ అవతారం శ్రీకృష్ణుడు జన్మదినం. కృష్ణ జన్మాష్టమిని జన్మాష్టమి, లేదా గోకులాష్టమి అని పిలుస్తారు. శనివారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని మండపేట నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి ఆలయాలు సోభాయమానంగా తీర్చిదిద్దారు. వేద పండితులు స్వామిని విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. తమ చిన్నారులను కన్నయ్య, గోపికల వేషధారణల్లో అలంకరించుకుని తల్లిదండ్రులు మురిసిపోయారు. విద్యాలయాల్లో ఉట్టుకొట్టి ఉత్సవాలను నిర్వహించి సందడిగా గడిపారు. అంగరలోని శ్రీకృష్ణాలయం, అంగర, వెదురుమూడి, వల్లూరు, కాలేరు, నల్లూరు గ్రామాల్లోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో సందడి నెలకొంది. కేదారిలంకలో సాదా లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరు సత్యానందం పర్యవేక్షణలో ఉట్టుకొట్టు ఉత్సవం నిర్వహించారు.

మండపేట మండలంలో...

మండపేట పట్టణంలోని పలు వార్డులు, ప్రైవేటు విద్యాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆపిల్ ప్లే స్కూల్ విద్యార్థులు కన్నయ్య, గోపిక వేషధారణల్లో అలరించారు. పాఠశాల నిర్వాహకులు బలుసు ప్రజ్ఞ, రంగా, ఉపాధ్యాయినులు సుప్రియ, రేణుక, పూర్ణ, ఝాన్సీ, విజయదుర్గ, మానస పాల్గొన్నారు. ఎంపీఎస్ పాఠశాలలో ఉట్టుకొట్టు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విద్యాలయాల డైరెక్టర్ వల్లూరి చిన్నారావు చిన్నారుల కళా ప్రదర్శనలను అభినందించారు. స్వర్ణ భారతి పాఠశాలలో భరతనాట్యం, కంసుని నాటకం, కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకోగా విద్యార్థులను ప్రిన్సిపాల్ డి శ్రీనివాస్, ఉపాధ్యాయాలు అభినందించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కాజులూరు: మండల గ్రామాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు భక్తులు ఘనంగా జరుపుకున్నారు. తణుకువాడ, గొల్లపాలెం, కాజులూరు, అయితపూడి, దుగ్గుదుర్రు, పెదలంక తదితర గ్రామాల్లోని శ్రీకృష్ణ ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వేకువజామునుంచి భక్తులు ఆలయాలను సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి గీతాపారాయణం పటించారు. పలు చోట్ల చిన్నారులు బాల కృష్ణుడు, గోపికల వేషదారణలతో ఉట్టికొట్టి ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

జయ జనార్దనా..కృష్ణా రాధికాపతే

రాయవరం: హరే కృష్ణ హరే కృష్ణ..కృష్ణ కృష్ణ హరే హరే అంటూ కృష్ణ నామస్మరణతో శనివారం వైష్ణవాలయాలు మార్మోగాయి. మండలంలో ప్రజలు గోకులాష్టమి వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు వైష్ణవాలయాలకు వెళ్లి పూజాధికాలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిక్కిరిశాయి. ఉట్లోత్సవంతో పల్లెలు సందడి వాతావరణాన్ని సంతరించుకున్నాయి. స్థానిక వాసుదేవా యాదవ సంఘం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక మందిరాన్ని ఏర్పాటు చేసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సాహంగా యువకులు, చిన్నారులు ఉట్టికొట్టే వేడుకలో పాల్గొన్నారు. అనంతరం మహిళలు చేసిన కోలాటం అలరించింది.

భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు ఆలయాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామలోని ఓం శాంతి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సాంస్కతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మకుమారీలు రాజీ, కమలా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ద్రాక్షారామ గీతా మందిరంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వెలంపాలెం లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో ఉట్టి కొట్టే కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు.



గొల్లపాలెంలో కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరిస్తున్న చిన్నారులు



మండపేట ఎంపీఎస్ పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్నారి



రాయవరంలో ఉట్టి కొడుతున్న యువకులు



అంగరలో కన్నయ్య వేషధారణల్లో చిన్నారుల సందడి